న్యూఇయర్ శుభాకాంక్షల వెల్లువ



అల్వాల్: నూతన సంవత్సరం పురస్కరించుకొని మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్, మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్ఎస్ నేత నందికంటి శ్రీధర్ సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన మేయర్ కావ్య



జవహర్‌నగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో జవహర్‌నగర్ మేయర్ కావ్య, కార్పొరేటర్లు మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మేయర్‌కు శుభాకాంక్షలు..



గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయంలో పూజలు..



కుషాయిగూడ శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పూజలు నిర్వహించారు.

బొకేలు వద్దు.. పుస్తకాలు ముద్దు



కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బొకేలు వద్దు.. పుస్తకాలు ముద్దు అంటూ నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. తనను కలిసేందుకు వచ్చే వారు పెన్నులు, పుస్తకాలు ఇవ్వాలని కోరారు. దీంతో పలువురు ఆయనకు నోట్‌బుక్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



రామంతాపూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, గద్వాల విజయలక్ష్మిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నోట్‌బుక్స్ అందజేసి..



మల్లాపూర్: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి నోట్‌బుక్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవితో..



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు శివనాథ్‌గుప్తా, రాఘవేంద్రదాస్, ఇర్ఫాన్ సోమవారం మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవికి శుభాకాంక్షలు తెలిపారు.

పరమేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు



మల్లాపూర్: కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి నాచారం డివిజన్ కాంగ్రెస్ నేతలు సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న న్యూఇయర్ ముగ్గు



మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన లక్ష్మీ శైలజ వేసిన ముగ్గు ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింపజేసేలా ఉంది. పిల్లలు ఆటలకు దూరమై సెల్‌ఫోన్లకు బానిసైపోతున్నారు. పంజరంలో చిక్కుకొని సెల్‌ఫోన్ చూస్తున్న చిన్నారి ఉన్న ముగ్గు వేసిన లక్ష్మీ శైలజను పలువురు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మల్కాజిగిరి: ఉప్పరిగూడ రాజానగర్ వెల్ఫేర్ అసోషియేషన్, విజయ గణపతి దేవాలయం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మల్కాజిగిరిలో మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ సోమవారం ఆవిష్కరించారు.

శుభాకాంక్షలు



గౌతంనగర్: మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నూతనోత్తేజం..

2023 పాత సంవత్సరం గడిచిపోయింది. ఈ సంవత్సరం కొందరికి చేదు, మరి కొందరికి తీపి జ్ఞాపకాలను మిగిల్చింది. 2023 బైబై చెబుదాం.. కోటి ఆశలతో కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్నాం. కొత్త కొత్త ప్రయత్నాలు, విద్యా, ఉద్యోగ, వ్యాపార తదితర రంగాల్లో తాము అనుకున్నది సాధించి ఉన్నత స్థితికి చేరాలని పలువురు యువకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'తో పలువురు యువతీ, యువకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. - మల్లాపూర్/రామంతాపూర్

ఉత్సాహంతో పనిచేస్తా..



2024 కొత్త ఏడాదిలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నాలోని బలహీనతలు, వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉంటా.. నూతన ఉత్తేజంతో క్రమశిక్షణతో కష్టపడి ఈ సంవత్సరంలో నేను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తా.
- సంజయ్‌కుమార్, రామంతాపూర్ డిగ్రీ విద్యార్థి

నా డ్రీమ్స్ నేరవేర్చుకుంటా



నా ఆశయం నా డ్రీమ్స్ ఐఏఎస్ కావడం.. ఇది సాధించడం కోసం 2024 నూతన సంవత్సరంలో క్రమశిక్షణతో చదివి నా కలను నిజం చేసుకుంటా.. ఈ సంవత్సరంలో స్నేహితులతో స్నేహంగా ఉంటూ వారి ప్రేమాభిమానాలు పొందుతా..
- మహేష్ డిగ్రీ విద్యార్థి, రామంతాపూర్

స్వయం ఉపాధిపై దృష్టి సారిస్తా..



ప్రస్తుతం స్వయం ఉపాధిపై దృష్టి సారిస్తే బాగుంటుంది. మనం నేర్చుకునే పనిలో పది మందికి పని నేర్పిస్తే వారు కూడా ఉపాధితో పొందుతారు. నాలుగురికి ఉపాధి కల్పించినట్లు ఉంటుంది. కొత్త ఏడాదిలో నా కలను నేరవేర్చుకుంటా. - ఎం.మీనా, మల్లాపూర్

బంగారు భవిష్యత్‌కు పునాదులు



ఈ ఏడాదిలో బాగా చదువుకొని బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకుంటా.. తాము చేపట్టే పనుల్లో మనోధైర్యంతో ముందుకు వెళ్తా.. తమ తల్లిదండ్రులు తాముపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తాము మంచి పొజిషన్‌లో ఉంటే మా తల్లిద్రండులకు వారికి మేము ఇచ్చే బహుమతి. - ఎస్వీ. శశి, ఓల్డ్ మల్లాపూర్

వెంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూ



కాప్రా: 2023 ఏడాదికి గుడ్‌బై చెప్పి.. నూతన ఆశయాలతో 2024కు స్వాగతం చెప్పారు సర్కిల్ ప్రజలు. న్యూఇయర్ సందర్భంగా ఈ ఏడాదిలో తాము అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని కోరుకుంటూ తెల్లవారుజాము నుంచే ప్రజలు ఆలయాలకు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుషాయిగూడ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉదయం నుంచే పోటెత్తారు.

గడప గడపకు అయోధ్య రాముడి అక్షింతలు



శ్రీరాముల అక్షింతలతో గొడిశాల శ్రీనివాస్‌గౌడ్

బోడుప్పల్: బోడుప్పల్ అంబేద్కర్‌నగర్ కాలనీలో శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం అధ్యక్షుడు గొడిశాల శ్రీనివాస్‌గౌడ్ సోమవారం గడప గడపకు అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటా రామజ్యోతి వెలిగించాలన్నారు. ఆదర్శ పురుషుడు శ్రీరాముడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు ఆదిమూలం కరుణాకర్, పాము నాగరాజు, పోలోజు యాదగిరిచారి, ధర్మపురి అరవింద, గోదా మల్లేష్‌గౌడ్, పండుగ యాకయ్య, దావరీ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి అక్షింతల శోభాయాత్ర

రామంతాపూర్: అయోధ్యలోని శ్రీరామచంద్ర మూర్తి అక్షింతల శోభాయాత్ర సోమవారం రామంతాపూర్‌లోని ఇందిరానగర్, నెహ్రూనగర్, నేతాజీనగర్, ఓల్డ్ రామంతాపూర్ తదితర బస్తీల్లో కాలనీలో బీజేపీ విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఆర్ఎస్ఎస్ శ్రీరామ హనుంతుడి భక్తులు అక్షింతల కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వారు ఇంటింటికీ తిరుగుతూ శ్రీరాముడి చిత్రపటాన్ని అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో బండారు వెంకటరావు, సుబ్బరామయ్య, కుమారస్వామి, దామోదర కామేశం, దేవా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ

మల్లాపూర్: భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతోన్న నేపథ్యంలో భగవాన్ రామ్ లాల్లా విరాజ్‌మాన్‌ను పూజించిన అక్షింతలను మల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ భవానీనగర్‌కాలనీలో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, ముత్యంరెడ్డి, జానకీరామ్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, గిరి, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఆగచారి తదితరులు పాల్గొన్నారు.



రాములోరి అక్షింతలు పంపిణీ చేస్తూ..



మల్లాపూర్‌లో శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేస్తూ..

విద్యార్థి దశ నుంచే టెక్నాలజీ నేర్చుకోవాలి



నమూనాలను తిలకిస్తున్న రామ్‌జీ, కౌశిక్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థి దశ నుంచే టెక్నాలజీ నేర్చుకొని ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సీసీఎంబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌జీ పల్లెల అన్నారు. బోడుప్పల్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో 'ఫ్యూజన్ ఫియస్టా' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ అనేది విద్యార్థులలో పాఠశాల స్థాయిలో నేర్చుకోవాలని, వివిధ శాఖల్లో సరికొత్త ప్రయోగాత్మక పరికరాలను అందరికీ ఉపయోగపడేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ విధంగా ప్రోత్సహిస్తే విద్యార్థులు అద్భుతాలు చేసి నిరూపిస్తారన్నారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను ఆయన తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల రీజనల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నళిని జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోపాల్‌రెడ్డికి ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు వచ్చింది. నగరంలో తెలంగాణ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్) 2023లో కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అనంతరం బోడుప్పల్‌లో ఆయన మాట్లాడుతూ గ్రీన్ పాంతర్ షార్ట్ ఫిలిం ద్వారా పర్యావరణంపై రూపొందించిన సందేశాత్మక డాక్యుమెంటరీకి ఈ అవార్డు వచ్చిందన్నారు. సతమతమయ్యే మానవాళిని కాపాడుకునేందుకు తగిన పరిష్కార మార్గాలను చూపుతూ తనవంతు కృషి చేస్తానన్నారు. భూమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్న చిన్న షార్ట్ ఫిలిమ్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహించి సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.

అనాథాశ్రమంలో భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ రవిప్రసాద్

పోచారం: అన్నానగర్‌లోని అమ్మానాన్న అనాథాశ్రమంలో ఏర్పాటు చేసిన భోజనశాలను రిటైర్డ్ ప్రొఫెసర్ డీఎం రవిప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులను భారంగా భావించకుండా బాధ్యతగా ఆదరించాలన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి వృద్ధులకు తినిపించారు. కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ గగనం నారాయణ, నిర్వాహకులు కడమంచి రాంబాబు, ఎం.నర్సయ్య, ఆర్.జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన తరుణ్‌గౌడ్



బోడుప్పల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్ సచివాలయంలో కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసిన తరుణ్‌గౌడ్ ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ 21వ డివిజన్ అధ్యక్షుడిగా గణేష్



గణేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బీఆర్ఎస్ 21వ డివిజన్ నూతన కమిటీని సోమవారం కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చిన్నం బాల్‌నర్సింహ, నగేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రామ్‌నర్సయ్య, బీసీసెల్ అధ్యక్షుడిగా కృష్ణ, కమిటీ సభ్యులుగా రాజమౌళి, ప్రభాకర్, సాంబయ్య, బషీర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సింగం బాలరాజు, సిద్దులుయాదవ్, పాల్, కృష్ణ, రమేష్, ఓబుల్‌రెడ్డి, ప్రకాష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో లక్ష దీపార్చన



మేడ్చల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ఆలయ అర్చక గురుస్వామి క్రిష్ణమూర్తి ప్రత్యేక పూజలు చేసి లక్ష దీపార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించి పడి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. వివిధ రూపాల్లో దీపాలను అలంకరించి లక్ష దీపార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిద్రలోనే మహిళ మృతి

ఉప్పల్: ఓ గృహిణి నిద్రలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామంతాపూర్ అరవింద్‌నగర్ కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ శ్రీనివాస్ భార్య పద్మ(46) ఆదివారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. సోమవారం ఉదయాన్నే శ్రీనివాస్‌ను పద్మ నిద్రలేపి పనికి పంపించింది. అనంతరం తాను పడుకుంది. పనిలేక శ్రీనివాస్ ఇంటికి వచ్చి పద్మను లేపగా మృతి చెంది ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ అధికారులపై ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: సమాచార హక్కు చట్టం ద్వారా తాను అడిగిన సమాచారానికి సమాధానం ఇవ్వకుండా ఆ సమాచారాన్ని ఇతరులకు అందించి హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న జీహెచ్ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని జన తెలంగాణ రైట్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు వడ్డెం శ్యాం రాంగోపాల్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహించే జోనల్ సిటీ ప్లానర్ ప్రదీప్, సికింద్రాబాద్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రజితలు ఇచ్చిన ఓ అనుమతులపై తమ సంస్థ సమాచార హక్కు చట్టం ద్వారా తాము వివరాలు కోరినట్లు ఆయన ఫిర్యాదులో తెలిపారు. కొంత మంది అవినీతి అధికారులు నిబంధనలు పూర్తిగా అతిక్రమించి ఇచ్చిన అనుమతులపై తాను ఆర్టీఐ చట్టం ద్వారా వివరాలు సేకరించేందుకు యత్నిస్తే అదే ఫైల్‌కు సంబంధించిన వ్యక్తులకు దరఖాస్తు చేసిన తమ వివరాలు, ఫోన్ నంబర్లు అందించారని తెలిపారు. ఇలా చేయడంతో దరఖాస్తుదారుల ప్రాణాలకు రక్షణ ఉండదని, సమాచార హక్కు చట్టంలో ఇదే నిబంధన ఉందని అధికారుల నిర్వాహకంతో తమ సంస్థకు చెందిన వ్యక్తుల ప్రాణాలకు అపాయం పొంచి ఉందని అందులో తెలిపారు. ఇలా గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని ఇతరులకు అందించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శివారుల్లో ఉపాధి ప్రణాళికపై కసరత్తు



ఉపాధి హామీ పథకంలో గుర్తించిన పనులివే..

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో (మేటీరియల్ కాంపొండ్‌తో కలిపి) అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) కసరత్తు చేస్తోంది. వచ్చే ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు ఉపాధి కూలీలు చేపట్టనున్న పనులకు సంబంధించిన కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించారు. అందులో భాగంగా 21,586 మంది కూలీలకు 1.71 లక్షల పనిదినాల్లో రూ.5.30 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టాలన్న లక్ష్యాన్ని అధిగమించాలని యోచిస్తోంది. కూలీలకు వంద రోజులు పని కల్పించడం ద్వారా పేదల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరిగేలా డీఆర్డీఏ కార్యక్రమాన్ని రూపొందిస్తోంది.

గతేడాది పనులిలా..

జిల్లా మేడ్చల్–మల్కాజిగిరిలో ఘట్‌కేసర్, కీసర, మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలో మొత్తం జాబ్ కార్డులు 19,350 ఉండగా, ఇందులో ఎస్టీ జాబ్ కార్డులు 1500, ఇతర కులాల వారి జాబ్‌కార్డులు 13,610 ఉన్నాయి. ఈ జాబ్ కార్డులకు సంబంధించి కూలీల సంఖ్య 21,586 మంది ఉన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఐదు మండలాల పరిధిలోని 17,699 జాబ్ కార్డులకు సంబంధించి 2,369 మంది కూలీలకు 37,631 పనిదినాలను కల్పించడం ద్వారా సామాగ్రితో కలిపి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనుల విలువ దాదాపు రూ.కోటి ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రతిరోజూ 127 నుంచి 282 మంది కూలీలు ఉపాధి పనుల్లో పని చేస్తున్నారు. చెరువు పూడికతీత పనులతో పాటు కందకాలు తవ్వడం, ఫీడల్ కాలువల నిర్మాణం, హరితహారం పనుల్లో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం వంటి పనులను ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేపట్టారు.

ఉపాధి హామీ పథకంలో గుర్తించిన పనులివే..

ఉపాధి హామీ పథకంలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది. ఊట కుంటలు, కందకాలు తవ్వడం, ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచడం, పల్లె ప్రకృతి వనాలు, రైతు కల్లాలు, ఇంకుడు గుంతలు, ప్రభుత్వ స్థలంలో నేలను చదును చేయడం, ఎండిపోయిన బోరుబావుల రీచార్జి, వైకుంఠ ధామాలు, ప్రభుత్వ సంస్థలకు రోడ్లు వేయడం, డంపింగ్ యార్డులు, కామన్ ల్యాండ్ సోక్ ఫిట్స్, కొత్తగా నిర్మించిన రహదారులపై గ్రావెల్ వేయడం, కంపోస్ట్ ఎరువుల గుంతలు, ఫీడర్ కాల్వలు వంటి పనులను కూలీలు చేపట్టేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అలాగే పశువులు, గొర్రెలు, మేకల తొట్ల నిర్మాణం, పండ్ల తోటల నిర్మాణం, తాటి వనాలు పెంచడం, చేపల కుంటలు, మిషన్ భగీరథ కోసం కందకాలు, మైనర్ ఇరిగేషన్ కాల్వల్లో పూడిక తీయడం, హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం వంటి ఉపాధి పనులు కూడా కూలీలు చేపట్టవచ్చని పేర్కొంది.